సంచిక 2 - జూన్ 2019

# LEISA INDIA

# లీసా ఇండియా

తెలుగు ప్రత్యేక ప్రచురణ

***Magazine on Low External Input Sustainable Agriculture***
***Compilation of Selected translated articles into Telugu***

తక్కువ బాహ్య ఉత్పాదకాలను ఉపయోగించి చేసే సుస్థిర వ్యవసాయ పత్రిక
తెలుగులోకి అనువదించిన కొన్ని వ్యాసాల సంకలనం



# లీసా ఇండియా

సంచిక 2, జూన్ 2019

ఈ సంచికలో వ్యాసాలు లీసా ఇండియా పత్రికలో ప్రచురితమైన ఆంగ్ల వ్యాసాల నుండి ఎంపిక చేయబడ్డవి.

ఎ.యమ్.ఇ. ఫౌండేషన్
నం. 204, 100 ఫీట్ రింగ్ రోడ్, మూడవ స్టేజ్,
రెండవ ఫేస్, బనశంకరి, బెంగళూరు - 560085
ఫోన్ : +91 080 26699512
+91 080 26699522
ఫ్యాక్స్ : +91 080 26699410
email : leisaindia@yahoo.co.in

| | |
|---|---|
| లీసా ఇండియా | ఆంగ్లంలో లీసా ఇండియా పత్రికను ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ వారు ఇలియా వారి సహకారంతో ప్రచురించుచున్నారు. |
| ఛీఫ్ ఎడిటర్ | కె.వి.యస్. ప్రసాద్ |
| మేనేజింగ్ ఎడిటర్ | టి.యమ్. రాధ |
| అనువాదం | రామ శేషు సూరంపూడి |
| అనువాద సమన్వయం | వీణ మార్కాండే |
| అడ్మినిస్ట్రేషన్ | రుక్మిణి జి. జి. |
| డిజైన్ లేఔట్ | శ్రీ సాయి క్రియేటివ్ డిజైనర్స్, హైదరాబాద్ |
| ముద్రణ | స్పాన్ ప్రింట్, బెంగళూరు |
| కవర్ ఫోటో | పెరటి తోటలో పెంచిన పంటను చూసి మురిసిపోతున్న గలిగి గ్రామానికి చెందిన పారవ్వ |

## లీసా మేగజైన్

**ఇతర ఎడిషన్లు**

లాటిన్ అమెరికన్, వెస్ట్ ఆఫ్రికన్,
బ్రెజిలియన్ మరియు ఈస్ట్ ఆఫ్రికన్ ఎడిషన్

## లీసా ఇండియా మేగజైన్

**ఇతర ప్రాంతీయ ఎడిషన్లు**

హిందీ, ఒరియా, తమిళ్, కన్నడ, మరాఠీ, పంజాబీ

ఈ పత్రిక నందలి అంశములు సాధ్యమైనంత ఖచ్చితత్వాన్ని కలిగి వుండుటకు ఎడిటర్లు అన్ని జాగ్రత్తలను తీసుకోవడం జరిగినది. వ్యక్తిగతంగా వ్రాసిన ఆర్టికల్స్‌కు ఆ రచయితలే బాధ్యత వహించెదరు.

ఈ పత్రికలోని వ్యాసాలను ఫోటోకాపి తీసి మిగతా వారికి ఇవ్వడాన్ని ఎడిటర్స్ ప్రోత్సహిస్తారు.

మిసెరియార్ వారి తోడ్పాటుతో ఎ.యమ్.ఇ.ఎఫ్. వారిచే ప్రచురితం

## లీసా LEISA www.leisaindia.org

లీసా అంటే తక్కువ బాహ్య ఉత్పాదకాలను ఉపయోగించి చేసేటటువంటి సుస్థిర వ్యవసాయం. ఇది సామాజిక మరియు సాంకేతిక పరమైన విషయాలను జోడించి రైతులు పర్యావరణాన్ని పరిరక్షిస్తూ తమ యొక్క ఉత్పాదకత మరియు ఆదాయాన్ని పెంచుకొనుట గురించి పనిచేస్తుంది. లీసా అనునది స్థానిక వనరులను మరియు సహజ ప్రక్రియలను సరియగు విధంగా ఉపయోగిస్తూ అవసరమైతేనే బాహ్య ఉత్పాదకాలు (ఇన్‌పుట్స్) ఉపయోగించుకొనుట గురించి తెలియజేస్తుంది. ఇది స్త్రీ, పురుష రైతులు వారి విజ్ఞానం, నైపుణ్యం, విలువలు, సంస్కృతి మరియు సంస్థల ఆధారంగా సాధికారతను సాధించి భవిష్యత్తును నిర్మించుకొనుట కొరకు ఉపయోగపడుతుంది. అంతేకాక భాగస్వామ్య పద్ధతుల ద్వారా రైతుల మరియు ఇతరుల యొక్క సామర్థ్యాలను పెంపొందించి, మారుతున్న అవసరాలు మరియు పరిస్థితులకనుగుణంగా వ్యవసాయ వృద్ధిని సాధించుట లీసా లక్ష్యం. సాంప్రదాయ మరియు శాస్త్రీయ విజ్ఞాన పద్ధతులను జోడించి విధాన పరమైన నిర్ణయాలను ప్రభావితం చేసి తదుపరి అభివృద్ధికి సరియైన బాటను పరచటం లీసా యొక్క ప్రధాన ఉద్దేశ్యం. లీసా అనునది ఒక భావన, ఒక విధానం మరియు ఒక రాజకీయ సందేశం.

## ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ AMEF www.amefound.org

ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ దక్కన్ పీఠభూమిలోని చిన్న, సన్నకారు రైతులతో కలిసి ప్రత్యామ్నాయ సాగు పద్ధతులను రూపొందించి, విజ్ఞానాన్ని పెంపొందించి, శిక్షణను అందించి, వివిధ అభివృద్ధి సంస్థలను అనుసంధానించి అనుభవాలను పంచుకుంటుంది.

ధర్మకర్తలు

| | | |
|---|---|---|
| చైర్మన్ | : | శ్రీ చిరంజీవ్ సింగ్, ఐ.ఎ.ఎస్ |
| సభ్యులు | : | డా. ఎం. మహదేవప్ప, డా. ఎన్. జి. హెగ్డే, డా. టి.ఎం. త్యాగరాజన్, ప్రొ॥ వి. వీరభద్రయ్య, డా. ఎ. రాజన్న, డా. వెంకటేష్ తగత్, డా. స్మిత ప్రేమ్‌చందర్ శ్రీ అశోక్ చటర్జీ |
| కోశాధికారి | : | శ్రీ బి.కె. శివరాం |
| ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ | : | శ్రీ కె.వి.ఎస్. ప్రసాద్ |

## మిసెరియార్ MISEREOR www.misereor.org

మిసెరియార్, అభివృద్ధి సహకారానికై 1958లో స్థాపించబడిన జర్మన్ కాథోలిక్ బిషప్పుల సంస్థ. ఈ సంస్థ 50 ఏళ్ళకు పైగా ఆఫ్రికా, ఆసియా మరియు లాటిన్ అమెరికా దేశాలలో దారిద్ర్య నిర్మూలనకు కృషి చేస్తూ ఉన్నది. జాతి, మత, లింగ భేదాలతో నిమిత్తం లేకుండా, అవసరంలో ఉన్న ఏ మనిషికైనా మిసెరియార్ సంస్థ తోడ్పాటు లభిస్తుంది.

పేద ప్రజలు, ప్రతికూల పరిస్థితులలో ఉన్నవారు స్వయంగా చేపట్టే ప్రయత్నాలకు మిసెరియార్ సహాయపడుతుంది. మిసెరియార్ స్థానిక సంస్థలతో - చర్చికి సంబంధించిన సంస్థలతో, ప్రభుత్వేతర సంస్థలతో, సామాజిక ఉద్యమాలతో మరియు పరిశోధనా సంస్థలతో కలిసి పనిచేస్తుంది. లబ్ధిదారులతో కలిసి ఈ భాగస్వామ్య సంస్థలు స్థానిక అభివృద్ధి విధానాల రూపకల్పనకు, ప్రాజెక్టుల అమలుకు తోడ్పడతాయి. ఈ విధంగా మిసెరియార్ సంస్థ, తన భాగస్వామ్య సంస్థలతో కలిసి నిరంతరం మారుతున్న సవాళ్ళకు ప్రతిస్పందిస్తుంది.

ప్రియ పాఠకులారా

వైవిధ్యంతో కూడిన సేద్య విధానాలను, కలిసికట్టుగా మార్కెటింగ్ సదుపాయాలు సమకూర్చుకోవలసిన అవసరాలను, వాటి ప్రాధాన్యతలను వివరిస్తూ లీసా ఇండియా ఈ సంచికను అందిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది.

నిత్యం మారిపోతున్న వాతావరణ మార్పుల నేపథ్యంలో, వాతావరణపరంగా ఎదురయ్యే సవాళ్లను తట్టుకునే విధానాలు అనుసరించడంలో రైతుల విచక్షణ చాలా కీలకమైన పాత్ర పోషిస్తుంది. చిన్న, సన్నకారు రైతులు అనేక సంవత్సరాలుగా వ్యవసాయ రంగంలో వ్యతిరేక పరిస్థితులను తట్టుకోగల విధానాలను గుర్తించి ఆచరణలోకి తీసుకువచ్చి మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. రైతుల విచక్షణతోనే వారు ఆ నైపుణ్యాలను సమకూర్చుకోగలిగారనేది నిస్సందేహం. ముఖ్యంగా పర్యావరణ అనుకూల మేనేజ్‌మెంట్ విధానాలు, వైవిధ్యంతో కూడిన సేద్య విధానాలు వారికి అన్ని విధాలా అనుకూలంగా నిలిచాయి. ఉప్పరహళ్లిలోని చాలా మంది రైతులు కూరగాయల సాగులో ఏకంగా ఒక వ్యవస్థగా రూపొందించడమే కాకుండా డెయిరీ నిర్వహణ చేపట్టి ఎంటర్ ప్రిన్యూర్‌లుగా మారిపోతున్నారు. ఫలితంగా అదనపు ఆదాయం సమకూర్చుకుంటున్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లోని గిరిజన ప్రాంతాలు కూడా ఇదే పద్ధతి అనుసరించి అక్కడి ప్రజల ఆరోగ్యాన్ని, జీవనోపాధులను కాపాడుకున్నారు. ఇంటి వెనక ఉండే పెరడు ఆధారంగా చేపట్టే కోళ్ల పరిశ్రమ ఇక్కడ గిరిజనులకు వరప్రదాయినిగా మారింది. స్థానికంగా లభించే కోళ్ల పెంపకమే వారికి అనువైనదిగా కనిపించింది. అంతేకాదు ఈ కోళ్ల పెంపకం వారికి ఎక్కువ నష్టాలు రాకుండా కాపాడాయి. ఆదాయం పెంచుకోవడం సాధ్యమైంది.

ఫార్మర్స్ ప్రొడ్యూజర్స్ కంపెనీగా ఏర్పడి ఒడిశాలోని కోరాపుట్ జిల్లాకు చెందిన రైతులు స్వతంత్రంగా కార్యక్రమాలు చేపట్టారు. సొంతంగా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుచేసుకున్నారు. తోటల నుంచి సాధించిన ఉత్పాదనలకు అదనపు విలువలు సమకూర్చుకున్నారు. ఉమ్మడిగా మార్కెటింగ్ సదుపాయాలు కల్పించుకున్నారు. చేను నుంచి మార్కెట్‌కు సరుకును చేర్చడంలో మేలైన మెళకువలను, సామర్థ్యాలను సంపాదించుకున్నారు. మొత్తం మీద ఆదాయ మార్గాలు మెరుగుపడ్డాయి. బేరసారాలు నిర్వహించుకోగలిగే నేర్పు సాధించుకున్నారు. ఇప్పుడు వారిలో ఆత్మవిశ్వాసం రోజు రోజుకీ పెరుగుతోంది.

మీ నుంచి ఎప్పటిలా ఆదరణ ఆశిస్తూ, మేము నిర్వహిస్తున్న రీడర్స్ సర్వేలలో చురుగ్గా పాలుపంచుకుని అవసరమైన సమాచారాన్ని నిర్దేశించిన ఫారమ్‌లో అందించాలని ఆశిస్తున్నాం. మీ సలహాసూచనలు కోరుతున్నాం.

సంపాదకులు




**స్థిరమైన జీవనోపాధికి మార్గం-సేవల్లో సరికొత్తవిలువల ఆవిష్కరణ - కులస్వామి జగన్నాథ్ జెనా**

పంటలను ఉత్పత్తి చేసే రైతన్నల సమూహంగా - ఫార్మర్ ప్రొడ్యూసర్స్ కంపెనీ - సమైక్యంగా సంఘటితమైన కోరాపుట్ జిల్లా (ఒడిశా) మహిళా రైతులు తమ తోటల్లో పండించిన ఉత్పత్తులకు నాణ్యమైన మార్కెటింగ్ సదుపాయాలు సాధించేందుకు, వాటికి మార్కెట్‌లో మరింత విలువను సంపాదించుకునేందుకు ప్రాసెసింగ్‌తో సహా...

**4**





**ఇండ్ల ఆవరణలోనే కోళ్ల పరిశ్రమ - కన్నా కె. సిరిపురపు, అనీతా కనుకొలను, సవ్యసాచి దాస్**

ఇంటి పెరళ్లలోనే దేశీయ కోళ్ల జాతి పెంపకంలో ఉన్న ఉపయోగాలు ఏమిటంటే - వాటి నిర్వహణ సులభం, నష్టాల భయం స్వల్పం, మెరుగైన ఆదాయం. ఇది అన్ని విధాలా పేద కుటుంబాలకు అనుకూలంగా ఉంటుంది కూడా. పేదరికాన్ని తగ్గించివేస్తుంది.

**9**





**సేద్యంలో వైవిధ్యం - ఎం.ఎస్.కులకర్ణి, టి.సురేశ్**

వాతావరణంలో వచ్చే మార్పులు చిన్న, సన్నకారు రైతుల జీవితాలను మరిన్ని కడగండ్లలో ముంచివేస్తున్నాయి. ఈ చిన్న రైతుల జీవనోపాధి దారుణంగా దెబ్బతింటోంది. ఇలాంటి పరిస్థితిలో వైవిధ్యంతో కూడిన సేద్యం మాత్రమే వారి వ్యవసాయ జీవనాన్ని నిలకడగా కొనసాగించేందుకు ఆశారేఖగా కనిపిస్తోంది.

**13**





**రైతన్న అనుసరించే సేద్య విధానాలే సుస్థిరమైన పర్యావరణ భద్రతకు శ్రీరామరక్ష - ఎస్.కళావతి**

వ్యవసాయ రంగంలో విజయ సాధన ప్రధానంగా అనుకూలమైన సేద్య విధానాలు అనుసరించడంతో పాటు వ్యవసాయ-పర్యావరణ హితమైన కారణాలను అవగాహన చేసుకోవడంపైనే ఆధారపడి ఉంటుంది. సన్నకారు రైతులు తరతరాలుగా వ్యవసాయ రంగానికి ఎదురయ్యే ప్రతికూల పరిస్థితులను అవగాహన చేసుకోవడమే కాకుండా...

**16**



ఆవాల నుంచి నూనె తీసే క్రమంలో నిమగ్నమైన ఉన్న మహిళా పారిశ్రామికులు

# స్థిరమైన జీవనోపాధికి మార్గం - సేవల్లో సరికొత్త విలువల ఆవిష్కరణ

కులస్వామి జగన్నాథ్ జెనా

**పంటలను ఉత్పత్తి చేసే రైతన్నల సమూహంగా – ఫార్మర్ ప్రొడ్యూసర్స్ కంపెనీ – సమైక్యంగా సంఘటితమైన కోరాపుట్ జిల్లా (ఒడిశా) మహిళా రైతులు తమ తోటల్లో పండించిన ఉత్పత్తులకు నాణ్యమైన మార్కెటింగ్ సదుపాయాలు సాధించేందుకు, వాటికి మార్కెట్‌లో మరింత విలువను సంపాదించుకునేందుకు ప్రాసెసింగ్‌తో సహా అనేక చర్యలు స్వయంగా చేపడుతున్నారు. పంట చేనుల్లో పండించే దశ నుంచి మార్కెట్‌లో విక్రయించుకునే వరకు మేలు రకం నిర్వహణ పద్ధతులను అనుసరిస్తూ తమ ఆదాయాన్ని గణనీయంగా పెంచుకుంటున్నారు. ఆ ప్రయత్నంలో బేరసారాలలో సమర్థవంతమైన శక్తియుక్తుల్ని ప్రదర్శిస్తున్నారు. అదే సమయంలో వారిలో ఆశలు, ఆశయాలు, లక్ష్యాలు రోజురోజుకీ పైకి ఇంకా పైకి ఎగబాకుతున్నాయి.**

ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్ జిల్లాలోని దస్మంత్‌పూర్ బ్లాక్‌లో చాలాకాలంగా వరి, చిరుధాన్యాలు, మొక్కజొన్న, గడ్డి నువ్వులు (niger) పంటలను సాగు చేయడం సంప్రదాయంగా సాగుతున్నది. మరీ ముఖ్యంగా ఖరీఫ్ పంటకాలంలో నీటి సాగు ఎక్కువగా ఉంటుంది. ఎత్తుపల్లాలతో ఉండే పొలాలు, వాటిలో భూసారం చాలా తక్కువ. సరైన సాగునీటి సదుపాయాలు ఉండవు. ఫలితంగా ఏడాది కాలంలో ఒక్క పంట సాగుచేస్తే అదే గొప్ప. అదీ అక్కడి రైతన్నల దుస్థితి. సేంద్రీయ సాగు పద్ధతులపై వారికి సరైన అవగాహన కల్పించే వారు లేరు. కేవలం

> సేంద్రీయ సేద్యం వైపు 1850 కుటుంబాలు ఆసక్తి చూపించాయి. 2115 ఎకరాల్లో సేంద్రీయ ఆహార పదార్థాలు పండించేందుకు ముందుకు వచ్చాయి. ఫలితంగా హెక్టారుకు వచ్చే దిగుబడి 5 నుంచి 10 శాతం వరకు అధికంగా సాధ్యమైంది.



*మహిళా రైతులు పండించిన మేలిరకం పసుపు*

సంప్రదాయంగా వాడుకలో ఉన్న విధానాలనే అనుసరించి సాగు చేస్తున్న కష్టజీవులు వారు. వారి కష్టానికి తగిన దిగుబడి వచ్చేది కాదు. తక్కువ దిగుబడులు వస్తున్న కారణంగా బేరసారాల్లో వారు ఎప్పుడూ నిలబడలేక మోసపోతూనే ఉండేవారు. ఫలితంగా వారికి అందే రాబడి కూడా చాలా తక్కువ. చేతికి అందిన కొద్దిపాటి ఆదాయంతో బతకలేక మెరుగైన ప్రత్యామ్నాయ ఉపాధులను వెతుక్కుంటూ దూరప్రాంతాలకు వలసపోవడం వారికి తప్పనిసరిగా మారింది.

ఆ పరిస్థితులలో అగ్రగామి అనే స్వచ్ఛంద సంస్థ వారికి ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కోవడంలో చేయూత ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. వారి జీవనోపాధిని వారు నివసించే ప్రాంతాలలోనే మెరుగైన రూపంలో సమకూర్చేందుకు నడుంబిగించింది. అందుకోసం రైతులను సంఘటితం చేసి ఉత్పత్తిదారులైన రైతులనే భాగస్వాములుగా చేసేందుకు చొరవ తీసుకుంది. నిధులు అందించే కేకేఎస్, నబార్డ్ సంస్థలతో పాటు ఒడిశా ప్రభుత్వ సహకారంతో అగ్రగామి సంస్థ సుస్థిరమైన జీవనోపాధులను సమకూర్చేందుకు ఒక కార్యక్రమం చేపట్టింది. గడచిన పదేండ్ల కాలంలో కోరాపుట్ జిల్లాలోని బడుగు, బలహీన వర్గాలకు చెందిన 4500 రైతు కుటుంబాలను, మహిళా రైతులను పర్యావరణ అనుకూల సేద్యం చేపట్టేలా ప్రోత్సహించగలిగింది.

## ఫార్మర్ ప్రొడ్యూసర్స్ కంపెనీ – ఒక ఉదాహరణ

దస్మాన్‌పూర్ జీడిపప్పు అభివృద్ధి, ప్రాసెసింగ్, మార్కెటింగ్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ (DCDPMPCL) అనేది అగ్రగామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసారు. అందులో రైతులు, మహిళా మండలి సభ్యులు భాగస్థులయ్యారు. రైతులకు గిట్టుబాటు ధరలను సంపాదించే కృషిలో ఈ విధంగా 87 గ్రామాలకు చెందిన వీరంతా చేతులు కలిపారు. ఆర్థికంగానూ, సామాజికంగానూ వెనుకబడిన రైతులను, మహిళలను ఈ కంపెనీ సంఘటితం చేసింది. వారిలో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే ఆలోచన రేకెత్తించింది. వారి శక్తియుక్తుల్ని సరైన మార్గంలో నడిపించి వారిని లాభార్జన దిశగా నడిపించింది. ఈ కంపెనీ 2016 మేలో ఏర్పాటైంది. అందులో 2050 మంది అభివృద్ధి ఆశించే రైతులు సభ్యత్వం తీసుకున్నారు. వారంతా 87 రైతు-ఉత్పత్తిదారుల గ్రూపులకు చెందిన వారు. (వాటిలో 37 ఉదయన్ వికాస్ సమితి విభాగాలు కాగా 50 మహిళా మండలులు)

ఇప్పుడు ఉదయన్ వికాస్ సమితి రూపంలోనూ, మహిళా మండలి రూపంలోనూ ఉన్న సభ్యులందరూ కూడా 2009-2011 మధ్య గ్రామ స్థాయి గ్రూపులుగా ఏర్పడ్డారు. వారు తమ పొదుపు మొత్తాలను జమచేసి, అవసరమైన సభ్యులకు రుణాలు ఇస్తూ పరస్పరం సహాయం అందించుకునేవారు. క్రమంగా వారంతా తోటల పెంపకం, పంటల సాగు పనులు చేపట్టడం మొదలుపెట్టారు. జీడిపప్పు, పసుపు, నూనె గింజలు, పప్పుధాన్యాలు, మామిడి తోటలు, కర్ర పెండలం (tapioca) , కొండ చీపుళ్ళ (hill broom) ఇంకా చిరుధాన్యాలు సాగుచేయడం ప్రారంభించారు.

ఈ కంపెనీ ప్రధాన లక్ష్యం ఏమిటంటే ఉత్పత్తిని అధికం చేయడం. అందులో భాగంగా ఉత్తమ పద్ధతులను తోటల పెంపకందారులు అనుసరించేలా ప్రోత్సహించడం. డిసెంబర్ 2017 నాటికి 1850 కుటుంబాలు 2115 ఎకరాల్లో సేంద్రీయ సేద్యం ప్రారంభించాయి. ఉత్పత్తి దాదాపు 5 నుంచి 10 శాతం అధికంగా లభించడం ప్రారంభమైంది.

*క్షేత్రస్థాయిలోనే స్థానిక విక్రేతలు*



## స్వయంసమృద్ధి దిశగా మహిళలు అడుగులేస్తున్న చోట!

ఒడిశా రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో కొండ చీపుళ్లు తయారు చేసేందుకు ఉపయోగపడే గడ్డి విస్తృతంగా పెరుగుతుంది. రాయగడ అటవీ రేంజిలోని పర్యావరణం, వాతావరణం కూడా వీటి పెంపకానికి అనువుగా ఉంటాయి. అవి చాలా నాణ్యమైనవి కూడా. అందువల్ల ఇక్కడి ప్రజలు వీటి సేకరణ, తయారీ, అమ్మకాలపైనే ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. ఈ రకమైన చీపుళ్లకు ఉన్న గిరాకీని గమనిస్తే ఏడాదిలో కొంత భాగం పూర్తిగా ఈ కొండ చీపుళ్ల సేకరణ విక్రయాలపైనే వారి జీవితాలు సాగుతూ ఉంటాయి. వారికి ఇది నిలకడ అయిన ఆదాయం సమకూర్చిపెట్టే మార్గంగా విస్తరిస్తోంది.

అమ్మ సంఘటన్ పేరుతో ఒక మహిళా సమాఖ్య 1982లో రిజిస్టరైంది. రాయగడ జిల్లా కాశీపూర్ బ్లాక్‌లోని 1225 మంది మహిళల సంఘటిత శక్తి ఇది. ముడి సరుకు సేకరణ, ప్రాసెసింగ్, సిద్ధం చేసిన సరుకును భద్రపరచడం, మార్కెట్‌లో విక్రయించడం వంటి కార్యకలాపాలను ఈ సమాఖ్య నిర్వహిస్తుంది. ప్రాసెసింగ్ చాలా సార్లు చేయాల్సి ఉంటుంది. సేకరించిన ముడి సరుకును కేంద్ర వేర్ హౌస్‌కు చేరుస్తారు. అక్కడే దాని ప్రాసెసింగ్ జరుగుతుంది. అయిదేండ్ల వ్యవధిలో 312 క్వింటాళ్ల నుంచి 411 క్వింటాళ్లకు చేరింది. ఫలితంగా ఇదే వ్యవధిలో టర్నోవర్ రూ.12,50,000 నుంచి రూ. 17,20,000కు చేరింది. వచ్చిన లాభాలను అందరూ సమానంగా పంచుకుంటారు. ఈ రకంగా ఈ మహిళలు స్వయంసమృద్ధి సాధించగలిగారు.

అంటుకట్టిన నారుమొక్కల వాడకాన్ని, పిట్ కంపోస్టు, వెర్మి కంపోస్టు, ఆకు అలములతో తయారు చేసిన సేంద్రీయ ఎరువులను ఉపయోగించడాన్ని ప్రోత్సహించారు. అంతేకాకుండా ఆకు అలములను కప్పడం, గుండ్రంగా ఉండే రింగుల రూపంలో ఎరువుల తయారీ, పిచ్చర్ ఇరిగేషన్ వంటి విధానాలను అనుసరించేలా చూశారు. వీటి విషయంలో అవసరమైన శిక్షణ ఇవ్వడమే కాకుండా వాటి ఉపయోగాలను ప్రదర్శనల రూపంలో చూపించారు. వాటిని అమలుచేస్తున్న ఇతర ప్రాంతాల క్షేత్రాలను వారిని తీసుకెళ్లి అనుభవంతో పాటు అవగాహన కలిగించారు. ఫలితంగా 56 గ్రామాలలోని 1275 మంది రైతులు తమ పొలాల్లో జీడి తోటలను పెంచడం మొదలుపెట్టారు. ఒక్కో చెట్టు నుంచి వారికి 5 నుంచి 7 కిలోల వరకు దిగుబడి లభించింది. ఇదే విధంగా 53 గ్రామాలకు చెందిన 1109 మంది రైతులు మామిడి తోటలు పెంచారు. వారికి ఒక్కో చెట్టు నుంచి 12 నుంచి 15 కిలోల వరకు దిగుబడి వచ్చింది. ఇన్‌పుట్ సరఫరా చేసే సేంద్రీయ పద్ధతుల్లో పండించిన మామిడి కాయలు కొనుగోలు చేస్తారు. ఒడిశా రాష్ట్ర జీడిపప్పు అభివృద్ధి సంస్థ (OSCDCL) అగ్రో సర్వీస్ సెంటర్, ఉత్కళ్ విత్తనాలు, నర్సరీ సంస్థలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతోంది.

కొండచీపురు పెంపకంను 58 గ్రామాలకు చెందిన 1250 మంది రైతులు చేపడుతున్నారు. గతంలో ఆక్రమిత భూములపై వీటిని పెంచేవారు. ఇప్పుడు దీనిని సొంత భూముల్లోనూ, ఉమ్మడి

*కొండ చీపుళ్ల నాణ్యతను పరిశీలిస్తున్న వినియోగదారుడు*





*గిరిజన కుటుంబాలకు జీడి తోటల పెంపకం వల్ల ఆదాయం పెరగడమే కాకుండా లాభాలు వస్తున్నాయి.*

భూముల్లోనూ కూడా ఒక క్రమ పద్ధతిలో సాగుచేస్తున్నారు. మెళుకువలు ఇప్పుడు నేర్చుకున్నారు. మేలైన పద్ధతులు అనుసరిస్తున్నారు. ప్రాసెసింగ్ సదుపాయాలు, చీపుళ్లకు మరింత విలువ కలిగించే విధానాలు తెలుసుకున్నారు. ఫలితంగా ఎకరా భూమిలో 400 నుంచి 450 కిలోలు పెంచడం సాధ్యమవుతోంది.

ఇదే విధంగా పసుపు సాగును 6 గ్రామాలకు చెందిన 79 మంది రైతులు చేపట్టారు. ప్రాసెసింగ్, అదనపు విలువలను సమకూర్చేందుకు వీరు ఎలాంటి సమష్టి కృషి చేసేవారు కాదు. అందుకు శాస్త్రీయ పద్ధతులపై అవగాహన లేకపోవడం ముఖ్యమైన కారణం. దిగుబడి ఎకరాకు 10000 నుంచి 12000 కిలోల వరకు ఉండేది. ఇప్పుడు 32 గ్రామాలకు చెందిన 407 మంది రైతులు పసుపు సాగులోకి వచ్చారు. వారు అనుసరించిన ఉత్తమ పద్ధతుల కారణంగా దిగుబడి 18000 నుంచి 22000 కిలోల వరకు ఎకరాకు వస్తోంది. సేకరణ, ప్రాసెసింగ్, విలువల చేర్పు ఇప్పుడు వారికి అందుబాటుకు వచ్చింది.

## అదనపు విలువలు – మార్కెటింగ్

ప్రాసెసింగ్ విధానాలపైనా, విలువ పెంపు విధానాలపైనా పూర్తి శిక్షణ పొందిన ఈ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఇప్పుడు వాటిని అమలుచేసి తమ ఉత్పత్తులను మరింత విలువలను

### టేబుల్ 1 – అదనపు విలువ చేర్చిన ఉత్పాదనలు

| క్రమ సంఖ్య | ఉత్పాదన | అదనపు విలువ | స్థానికంగా బ్రాండ్ పేరు | నిర్వహణ |
|---|---|---|---|---|
| 1 | జీడిపండ్లు | జీడిపప్పుగా మార్పు | దస్మాన్‌పూర్ కాష్యూనట్ | కంపెనీకి చెందిన రైతు గ్రూపు |
| 2 | మామిడి | పచ్చళ్లు, అమ్‌చూర్ (మామిడి పొడర్) తాంద్ర వంచి మాంగో కేక్ | దస్మాన్‌పూర్ పికిల్స్ (పచ్చళ్లు) | పై గ్రూపు |
| 3 | కొండ చీపురు | చీపుళ్లు | అమ్మా హొల్దీ | కంపెనీ- మహిళా మండళ్లు |
| 4 | పసుపు | పసుపు పొడి | శ్రద్ధా | కంపెనీ - మహిళా మండళ్లు |

సమకూర్చడంలో విజయం సాధించగలుగుతున్నాయి. (టేబుల్ 1 చూడవచ్చు). వరి ఉత్పత్తులకు స్థానికంగా ప్రత్యేకమైన గుర్తింపు సాధించేందుకు బ్రాండ్ రూపకల్పన కూడా చేశారు. మామిడి, జీడిపప్పు వంటి వాటికి విలువను పెంచే ప్రయత్నాలను ఈ కంపెనీకి అనుబంధంగా ఉండే వ్యాపార బృందాలు చేపట్టాయి. మహిళా మండలి సభ్యులు కొండ చీపుళ్లు, పసుపు ఉత్పాదనలకు విలువలు తెచ్చేందుకు కృషి చేస్తున్నాయి.

ఈ రకంగా రైతన్నలు ఏర్పాటు చేసుకున్న ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీలో గతంలో పనిచేసిన సభ్యులు ఉత్పత్తులను సేకరించి మార్కెట్‌కు చేరవేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. వారు ఈ ఉత్పాదనలను స్థానికంగా ఉండే మార్కెట్లకు మాత్రమే కాకుండా సిటీలలోని మార్కెట్‌కు కూడా వాటిని చేరవేస్తున్నారు. సేకరణ విషయంలో అగ్రగామి సహకారం అందిస్తోంది. సేకరణ నేర్పును వారికి కలిగించేందుకు కంపెనీ బోర్డు డైరెక్టర్లకు అగ్రగామి ప్రత్యేకంగా శిక్షణ అందిస్తోంది. నిష్పాక్షికంగా నాణ్యతను కాపాడేందుకు తోడ్పడుతోంది. ఈ శిక్షణలో మార్కెట్ విధివిధానాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా వారికి మెళకువలు నేర్పుతున్నది. మధ్య దళారుల వ్యవస్థను దూరంగా ఉంచడం వల్ల రైతులకు సముచితమైన గిట్టుబాటు ధర లభిస్తోంది. ప్రత్యేకంగా దస్మాన్‌పూర్‌లో ఒక విక్రయ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడ పూర్తిగా అదనపు విలువలు సమకూర్చిన ప్రాసెస్ చేసిన వస్తువులనే వినియోగదారులకు అందిస్తున్నారు. 2017 చివరి నాటికి 255 టన్నుల జీడి పప్పు, 145 టన్నుల మామిడి, 41 టన్ను కొండ చీపుళ్లు విక్రయించగలిగారు. పండించిన రైతు లేదా కంపెనీలో భాగస్వామి ఒకొక్కరు రూ.53,840 ఆదాయం సంపాదించగలిగారు. ఇదే విధంగా ఒడిశా రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, మార్కెటింగ్ సొసైటీతోను, పీసీఎం ఎక్స్‌పోర్ట్ సంస్థతోను ఒప్పందాలు కుదుర్చుకోగలిగారు. అందువల్ల రైతులకు మరో 40 శాతం అధికంగా ఆదాయం సమకూరింది. ఉదాహరణకు మధ్యవర్తులకు ముడి పసుపు కొమ్ములు విక్రయించడం వల్ల దస్మన్‌పూర్ బ్లాక్‌లోని మరీచగూడ రైతులు క్వింటాలుకు కేవలం రూ.8000 మాత్రమే సంపాదించగలిగేవారు. పసుపు పంటకు అదనపు విలువ సమకూర్చి నేరుగా మార్కెట్‌కి తీసుకెళ్లి విక్రయిస్తున్న కారణంగా వారికి క్వింటాలు పసుపు పొడికి రూ.15000 లభిస్తోంది. ఇదే విధంగా జీడిపప్పు, మామిడి, కొండ చీపుళ్ల విషయంలో కూడా రైతులకు అదనంగా 40 శాతం ఆదాయం లభిస్తోంది.

మార్కెట్ అనుసంధానంతో పాటు ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీలు సీజన్‌ల వారీగా రైతుల మేలాలను నిర్వహిస్తున్నారు. ఈ మేలా సందర్భంగా రైతులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అమ్ముకోగలుగుతున్నారు. ఆ రకంగా తమ ఉత్పత్తులకు ప్రత్యక్షంగా గిరాకీ సంపాదించుకుంటున్నారు. మార్కెటింగ్ సహాయమే కాకుండా ఈ కంపెనీ అత్యవసర సమయాల్లో రుణ రూపంలో సహాయం, వినిమయ వస్తువులకు, ఇంకా ఇతర వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి రిటైల్ సేవలు రైతులకు అందిస్తోంది.

## ముగింపు వాక్యాలు

వ్యవసాయ పనిముట్లు సమీకరించడంలోనూ, ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించే అవకాశాలు పెంచుకోవడంలో ఉమ్మడిగా కృషిచేయడం ద్వారా రైతులకు అధిక ఆదాయం సాధ్యమైంది. అంతేగాక వారు మరింత గిట్టుబాటు ధర కోసం బేరమాడగలిగే శక్తిని సమకూర్చుకోగలిగారు. సేకరణలో అనుసరించిన ఈ విధానం స్థానికంగా రైతులకు లభించే మద్దతు మరింత పెరిగింది. తోటి రైతులు మాత్రమే కాకుండా పాలనా యంత్రాంగం నుంచి కూడా వారికి మరింత మద్దతు అందుతోంది.

అయినా కూడా కొన్ని సమస్యలు ఎదురవుతూనే ఉన్నాయి. కంపెనీ రూపంలో సంఘటితం చేయడంలో స్వచ్ఛంద సంస్థ కృషి ప్రోత్సాహకరంగానే ఉన్నప్పటికీ, ఆ బాధ్యతను కేవలం సామాజిక బాధ్యతగా మాత్రమే అవి నిర్వహిస్తున్నాయి. మార్కెట్‌ను అవగాహన చేసుకోవడం, రైతులకు పారిశ్రామిక నిర్వహణ సామర్థ్యం పెంపొందించడంలో అవి ఆశించిన స్థాయిలో పనిచేయలేకపోతున్నాయి. ప్రస్తుత పరిస్థితులలో తప్పనిసరిగా ఇది చాలా అవసరం. అది వాటికి సాధ్యం కావడం లేదు. ఇటువంటి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ పటిష్టంగా రూపు దిద్దుకోవాలంటే అందుకు అనుకూలమైన వాతావరణం కూడా ఉండాలి. ఎందుకంటే ఇది వ్యవసాయ సంబంధిత విలువ పెంపు కృషికి సంబంధించిన అంశం. ఇది రైతు వ్యవసాయ క్షేత్రంలో ప్రారంభమై ఎక్కడో ఉన్న మార్కెట్‌లో ముగిసే వరకు సాగే ప్రయాణంలో ఇది ఇంకా తొలి అడుగు మాత్రమే. ◆

**Kulaswami Jagannath Jena**
Project Coordinator - Eco Village Development
Agragamee
Kashipur, Rayagada,Odisha, India.
www.agragamee.org
E-mail: kulaswami13@gmail.com

ఆంగ్లమూలం :
లీసా ఇండియా, సంపుటి 20, సంచిక 1, మార్చి 2018

# ఇండ్ల ఆవరణలోనే కోళ్ల పరిశ్రమ

## గిరిజన ప్రాంతాలలో విజయవంతమైన ప్రయోగం

**కన్నా కె. సిరిపురపు, అనీతా కనుకొలను, సవ్యసాచి దాస్, చంద్రశేఖర్ నేమాని**

**ఇంటి పెరళ్లలోనే దేశీయ కోళ్ల జాతి పెంపకంలో ఉన్న ఉపయోగాలు ఏమిటంటే - వాటి నిర్వహణ సులభం, నష్టాల భయం స్వల్పం, మెరుగైన ఆదాయం. ఇది అన్ని విధాలా పేద కుటుంబాలకు అనుకూలంగా ఉంటుంది కూడా. పేదరికాన్ని తగ్గించివేస్తుంది. ఆయా కుటుంబాలకు పోషకాహారం అందించ గలుగుతుంది. అదనపు ఆదాయానికి తోడ్పడే మరిన్ని ఉపాధి అవకాశాలు అందిస్తుంది. ఈ రకమైన కోళ్ల పరిశ్రమ నిర్వహణకు బయటి నుంచి ప్రత్యేకంగా ఎలాంటి సహకారం అవసరం ఉండదు. చిన్న తరహా వ్యవసాయ భూముల్లోనే చేపట్టేందుకు వీలుగా చిన్న స్థాయి పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహకరంగా ఉన్న ఈ ప్రయోగం ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజన ప్రాంతాలలో ఇప్పుడు జోరుగా సాగుతోంది. ఈ ప్రయత్నం పేద కుటుంబాల ఆరోగ్యానికి శ్రీరామరక్షగా ఉంటోంది. వారికి సరికొత్త జీవనోపాధిని చూపిస్తోంది.**

ఎన్నో ఏండ్లుగా అందరికీ తెలిసిన సత్యం ఒకటి ఉంది. స్థానికంగా లభించే పశు సంతతి మాత్రమే ఆయా ప్రాంతాల వాతావరణాన్ని తట్టుకోగలుగుతాయి. దేశంలో ఉత్పత్తి అవుతున్న మాంసం లేదా కోడి గుడ్లలో సుమారుగా 70 శాతం ఈ రకమైన స్థానిక కోళ్ల పెంపకం ద్వారానే లభిస్తున్నది. గడచిన మూడు దశాబ్దాల కాలంలో మన దేశంలో కోళ్ల పరిశ్రమ ముఖ్యంగా ఇండ్లలోనే పెంచి పోషిస్తున్నారు. ఈ పరిశ్రమ పురోగతి కూడా ఈ కాలంలో చాలా వేగంగా ముందుకెడుతోంది. వాణిజ్య స్థాయిలో జరుగుతోంది కూడా. ఆధునిక కాలంలో కోళ్ల పరిశ్రమ అత్యంత వేగంగా విస్తరిస్తోందనేది కూడా పూర్తిగా నిజం. అయితే వాణిజ్యపరంగా ఉత్పత్తి చేయవలసిన సమయాల్లో సంకరజాతి కోళ్లను పెంచవలసిన అవసరం ఏర్పడుతోంది. వాణిజ్యపరంగా సాగుతున్న కోళ్ల పరిశ్రమ కారణంగా దేశంలో మాంసం, కోడి గుడ్లకు లోటు లేకుండా ఉన్న మాట నిజం. అయితే ఇది ప్రజల ఆరోగ్యంపైనా, పర్యావరణపరంగానూ సమస్యలకు కారణమవుతోంది.

*రోజురోజుకీ విస్తరిస్తున్న - నిర్వహణ సౌలభ్యం ఉండడమే కాకుండా అదనపు ఆదాయం అందిస్తున్న పెరటి కోళ్ల పరిశ్రమ*



## ఇండ్లలో కోళ్ల పరిశ్రమ

చిన్న స్థాయిలో కోళ్ల పరిశ్రమ ఇండ్లలో అందుబాటులో ఉన్న పెరటి స్థలంలోనే సాగుతూ ఉంటుంది. అవడం చిన్న స్థాయి అయినప్పటికీ వాటిలో పెంపకం చేపట్టే కోళ్ల సంఖ్య చాలా ఎక్కువగా ఉండవచ్చు. లేదా కొద్దిపాటి మాత్రమే కావచ్చు. ఏదేమైనా ఈ రకమైన కోళ్ల పరిశ్రమ మన దేశంలో చాలా పెద్ద ఎత్తునే సాగుచున్నది. ఈ రంగానికి ఉన్న అవకాశాలు చాలా ఎక్కువ. ఆదాయం పెంచుకునేందుకు, చిన్న మధ్య తరగతి రైతులకు, వారి కుటుంబాలకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించేందుకు ఈ పరిశ్రమ ఎంతగానో తోడ్పడుతోంది. వాణిజ్యపరంగానూ చేపట్టవచ్చు. లేదా ఆ చిన్న మధ్య తరగతి రైతన్నలకు అనుకూలంగా ఉండేలా కూడా నిర్వహించవచ్చు. ఈ దృష్ట్యా చూస్తే దేశవ్యాప్తంగా వర్షాధారిత ప్రాంతాలలో ఈ పరిశ్రమ ప్రోత్సహించవచ్చు.

ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుర్తించింది. ప్రభుత్వ పశు సంవర్థక శాఖ, గిరిజన సంక్షేమ శాఖలు 2016లో గ్రామీణ దేశీయ పెరటి కోళ్ల పరిశ్రమ కార్యక్రమాన్ని రూపొందించాయి. ప్రధానంగా 13000 ఆదివాసీ కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూర్చడం, పోషక ఆహారం అందించే లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందుకోసం ఉత్పత్తి విధానాలు, వ్యాధుల నుంచి కోళ్ల రక్షణకు వ్యాక్సీన్‌లు, ఇంకా ఇతర సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. ముందుగా అందరికీ ప్రయోజనకరంగా ఉమ్మడి లక్ష్య సాధన మహిళా బృందాలను ప్రోత్సహించారు. కోళ్ల పెంపకాన్ని చిన్న స్థాయి పరిశ్రమగా గుర్తించారు. దీనికి తోడుగా క్లస్టర్ స్థాయి వ్యవస్థను కూడా సిద్ధం చేశారు. లీడ్ టెక్నికల్ ఏజెన్సీగా వ్యవహరించేందుకు వాసన్ (వాటర్‌షెడ్ సపోర్ట్ సర్వీసెస్ అండ్ అక్టివిటీ నెట్‌వర్క్ - WASSAN )కు ఈ కార్యక్రమం నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 129 క్లస్టర్లలో కార్యక్రమం ప్రారంభించారు. ఇప్పుడు ఇక్కడ మనం విశాఖపట్నం జిల్లా పెద్ద కొండపల్లి గ్రామంలో ఈ కార్యక్రమం సాధించిన విజయాన్ని తెలుసుకుందాం.

## ఆరంభం ఇలా

పెదబయలు మండలంలోని పెద్ద కొండపల్లి గ్రామంలో గట్టిగా 120 కుటుంబాలు ఉంటాయి. వారిలో చాలా మంది నిరుపేదలే. వ్యవసాయ కూలీలుగా జీవితాలు సాగిస్తున్న వారే. వారిలో కొంత మంది తమ ఇండ్లలోనే కోళ్ల పెంపకం చేస్తూ కొంత ఆదాయం సంపాదించుకునేవారు. అనేక కారణాల వల్ల కొద్దికాలంగా ఆ ప్రత్యామ్నాయ జీవనోపాధిని వదిలేసుకున్నారు. అందుకు ప్రధాన కారణాలు ఇవి. స్థానిక జాతి కోడి పిల్లలు లభ్యం

*పెద్ద కొండపల్లి గ్రామంలో ఉమ్మడి లక్ష్య సాధనకు ఏర్పాటు చేసుకున్న మహిళల బృందం సమావేశంలో పెరళ్లలో కోళ్ల పెంపకం గురించి వివరిస్తున్న దృశ్యం*





ఇంటి వెనక ఉన్న కొద్దిపాటి పెరడులో కోళ్ల పెంపకం చేపట్టిన గిరిజన మహిళ

కాకపోవడం, రాత్రివేళ సరైన భద్రత లేకపోవడంతో ఇతర వేటాడే జంతువుల నుంచి సమస్యలు, పెద్ద సంఖ్యలో పెంచుతున్న కోళ్లు చనిపోవడం, సరైన వైద్య సదుపాయాలు లేకపోవడం, కోళ్ల పెంపకంపై సరైన నైపుణ్యం లేకపోవటం. అప్పటి నుంచి ఆ కుటుంబాలు తమ అవసరాలకు కూడా వాణిజ్యపరంగా మార్కెట్‌లో లభించే బ్రాయిలర్ మాంసం, కోడిగుడ్లనే వినియోగించాల్సి వచ్చింది.

2016 చివరి మాసాల్లో వాసన్ రంగంలోకి దిగింది. స్థానికంగా పనిచేస్తున్న లయ అనే మరో స్వచ్ఛంద సంస్థ అందించిన క్షేత్రస్థాయి సహకారంతో గ్రామంలో వాసన్ తన కృషి ప్రారంభించింది. ముందుగా స్వయంసహాయక బృందాల రూపంలో మహిళలను సంఘటితం చేసేందుకు ముందుగా దృష్టి పెట్టింది. సభ్యులకు పెరళ్లలో కోళ్ల పెంపకం కార్యక్రమం గురించిన అవగాహన కలిగించారు. ఆ తరువాత ఉమ్మడి లక్ష్యాల సాధనకు వీలుగా కామన్ ఇంటరెస్ట్ గ్రూపులను (సీఐజీ) ఏర్పాటు చేసింది. సభ్యుల నుంచి రూ.300/- చొప్పున వసూలు చేశారు. ఈ రకంగా వసూలు చేసిన ఫీజులో రూ.100/- లను సభ్యత్వ రుసుముగా నిర్ణయించారు. ఈ ఫీజు ఒక్కసారి మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. మిగిలిన రూ.3000/- సహాయంగా (ఇందులో రూ.2700/- కోడి పిల్లలను కాపాడేం దుకు వీలుగా నైట్ షెల్టర్ నిర్మాణానికి, మరో రూ.300/- 45 రోజుల వయసున్న 5 కోడి పిల్లల కొనుగోలుకు) అందజేశారు. ఈ విధంగా కేవలం 5 కోడి పిల్లలతో వారి పెరటి కోళ్ల ఫారమ్ రూపుదిద్దుకుంది. పెరళ్లలోనే బ్రీడింగ్ ఫారమ్ కూడా..

నిత్యం స్థానిక జాతి కోడి పిల్లల సరఫరా ఉండేందుకు వీలుగా స్థానికంగానే బ్రీడర్ ఫారమ్ నెలకొల్పాడు. ఈ గ్రామానికి చెందిన కోడా అబ్బాయి దొర దీన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు

> పశువైద్య సేవలను పారా-వెటిరినేరియన్లు అందించారు. ఫలితంగా కోళ్ల మరణాల శాతం సున్నా స్థాయికి చేరింది

వచ్చారు. ఆయన కూడా సీఐజీలో సభ్యుడే. ఆయన నెలకొల్పిన బ్రీడర్ ఫారమ్ నుంచి గ్రామంలోని ఇతర సీఐజీ సభ్యులకు ఆయన కోడి పిల్లలు సరఫరా చేస్తున్నారు.

ఇందుకోసం ఆయన తన పొలంలోనే అర ఎకరం కేటాయించారు. సుమారు రూ.30,000/- పెట్టుబడి పెట్టారు. ఈ మొత్తం ప్రాజెక్టులో భాగంగా బ్రీడర్ ఫారమ్ ఏర్పాటుకు గానూ దాదాపు రూ.96,500/- ఆర్థిక సహాయం అందింది. అందులో మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఎన్‌క్లోజర్/పెన్ (కంచె ఏర్పాటు ఉన్న ప్రాంగణం, నీటి సరఫరా, కోడి పిల్లల కొనుగోలు, వాటికి ఏడాది కాలానికి సరిపడే మేత వంటివి ముఖ్యమైనవి). ఈ మొత్తం ప్రక్రియను 2016వ సంవత్సరం రెండో అర్ధభాగంలో ప్రారంభించారు. ఇది పూర్తి కావడానికి ఆరు నెలలు పట్టింది. అంటే పెరటి కోళ్ల ఫారమ్‌లు 2017 మే నుంచి అందుబాటుకు వచ్చాయి. అప్పట్లో వాటిలో కేవలం 60 కోడి పిల్లలు ఉండేవి.

బ్రీడర్ ఫారమ్ ఏర్పాటు అక్కడి పరిస్థితిని పూర్తిగా మార్చివేసింది. స్థానికంగా ఉన్న వినియోగదారుల అవసరాలకు సరిపడే విధంగా దేశీయ కోడి పిల్లలను అందించడం సాధ్యమైంది. ఇప్పటి వరకు ఆయన 480 కోడి పిల్లలను సరఫరాచేయగలిగారు. ఆయన నుంచి 86 మంది సీఐజీ సభ్యులు వాటిని కొనుగోలు చేశారు. అన్నీ కూడా నెల రోజుల వయసు ఉన్నవే కావడం విశేషం. ఒక్కో కోడి పిల్లకు ఆయన రూ.80/- వసూలు చేశారు. ప్రతి కుటుంబం కూడా 5 నుంచి 10 కోడిపిల్లల పెంపకం చేపట్టింది.

ఇలా సీఐజీ సభ్యులు మాత్రమే కాకుండా స్థానిక మార్కెట్‌లో కూడా ఆయన చికెన్ విక్రయించేవారు. ఈ విధంగా 45 నల్ల కోళ్లను, 11 కోడిపిల్లలను విక్రయించాడు. ఫలితంగా ఆయన రూ.11650/- సంపాదించారు. ఎంపిక చేసిన వినియోగదారులకు మాత్రమే ఆయన కోడి గుడ్లు అమ్మేవారు. ఎందుకంటే ఆయన గుడ్లను అమ్మటంపై అంత ఆసక్తి చూపించేవాడు కాదు. ఎక్కువగా కోడి పిల్లల అమ్మకంపైనే ఆయన దృష్టి పెట్టాడు. 2017లో ఆయన ఆదాయంలో దాదాపు 65 శాతం బ్రీడర్ ఫారమ్ ద్వారానే సాధ్యమైంది.

## వైద్యం తదితర సేవల లభ్యత

ఈ గ్రామానికి సాధ్యమైనంత దగ్గరలోని ప్రభుత్వ వెటర్నరీ క్లినిక్‌ను 15 కిమీ దూరంలో ఉన్న పాడేరులో ఉంది. దీంతో వైద్య సేవలు సకాలంలో పొందడం సమస్యగా ఉండేది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఈ ప్రాజెక్టు కింద స్థానికంగా నివసించే వారికి పారా-వెటర్నియేరియన్లుగా శిక్షణ ఇచ్చేందుకు ప్రతిపాదిం చారు. కొంత మందిని ప్రత్యేకంగా ఎంపిక చేసుకున్నారు. వారిలో మహిళలకే ప్రాధాన్యత నిచ్చారు. అలాంటి వారికి 2 లేక మూడు రోజుల పాటు కోళ్లు, కోడి పిల్లలు, తదితర పశు వైద్య సంబంధిత అంశాలపై శిక్షణ ఇచ్చారు. స్థానికంగా అందుబాటులో

ఉన్న వెటరినరీ డాక్టర్లు, ఫెసిలిటేటింగ్ ఏజెన్సీ సిబ్బంది, వాసన్ ప్రతినిధులు వారికి శిక్షణ ఇచ్చే విషయంలో రిసోర్స్ పర్సన్‌లుగా కృషిచేశారు.

ఇలా శిక్షణ పొందిన పారా-వెటరినేరియన్లు స్థానికంగా ఉండే పశువుల ఆరోగ్య సంబంధ సమస్యలపై ప్రాథమిక చికిత్స అందించడంలో ఉపయోగపడ్డారు. ప్రతీ వంద కుటుంబాలకు ఇద్దరు పారా-వెటిరియనేరియన్లు అందుబాటులో ఉండేలా చూసుకున్నారు. వారి సేవలకు గానూ రూ.2/- ఇచ్చేలా ఏర్పాటు చేయడం వల్ల వారికి స్థానికంగానే జీవనోపాధి చూపినట్లయింది. సభ్యులు ముందుగా చెల్లించిన మొత్తంలో (సీఐజీ సభ్యత్వం తీసుకునే సమయంలోనే రూ.200/- అడ్వాన్స్‌గా వసూలుచేసిన విషయం ఇంతకుముందే గమనించాం) నుంచి ఈ స్వల్ప ఫీజును పారా సిబ్బందికి చెల్లిస్తారు. వైద్య చికిత్స అందించిన ప్రతి పక్షి విషయంలోనూ ఇదే విధంగా వసూలు చేయడం జరుగుతుంది. జమ చేసిన నిధులు అయిపోయిన వెంటనే సభ్యుడు మళ్లీ అంత మొత్తాన్ని జమచేయాల్సి ఉంటుంది. ఈ విధంగా పారా సిబ్బందిని అందుబాటులోకి తెచ్చిన తరువాత వ్యాధుల భయం తగ్గి వైద్య సేవలు విస్తరించడంతో పాటు మరణాలు కూడా గణనీయంగా తగ్గిపోయాయి.

కోళ్ల ఆరోగ్య సంరక్షణ, కోళ్ల ఫారమ్‌ల నిర్వహణలో అనుసరించవలసిన ఉత్తమ పద్ధతుల గురించిన సమాచారం, పరిజ్ఞానాన్ని ఫెసిలిటేటింగ్ ఏజెన్సీ లయ, వాసన్ అందించాయి. ఇంకా ఈ రంగంలో ఆసక్తి ఉన్న వ్యక్తులు, శ్రేయోభిలాషులు కూడా తమ వంతు సాయం అందిస్తూ వచ్చారు.

## ప్రభావం

పెద్ద కొండపల్లి గ్రామంలోని అన్ని కుటుంబాలు కూడా ఈ రకంగా ఇండ్లలోనే కోళ్ల పెంపకం చేపట్టడంతో కోళ్ల పెంపకంలో సంప్రదాయక జాతులు అభివృద్ధి చెందుతున్నాయి. స్థానికంగా ఉన్న అన్ని వర్గాల ప్రజలు స్థానికంగానే లభిస్తున్న కోడి గుడ్లను, మాంసాన్ని ఆహారంలో భాగంగా ఉపయోగించుకుంటున్నారు. వాణిజ్యపరంగా ఉత్పత్తి చేసిన కోళ్లు, గుడ్ల కంటే ఇవి ఆరోగ్యకరమైనవిగా గుర్తింపు పొంది స్థానికులకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించగలుగుతున్నాయి.

బ్రీడింగ్ ఫారమ్ ఏర్పాటు వల్ల అన్ని ఇండ్లలోని వారికి కోడి పిల్లలు అందుబాటులోకి వచ్చాయి. వాటిని నిర్వహిస్తున్న కుటుంబాల ఆర్థిక స్థితి కూడా మెల్లిగా మెరుగుపడుతోంది. ఈ కోడి పిల్లల విసర్జనాలను ఎరువులుగా వ్యవసాయంలో ఉపయోగిస్తున్నారు. ఆ రకంగా భూసారం కూడా మెరుగుపడుతోంది.

పెద్ద కొండపల్లి గ్రామంలో ఇపుపడు దేశీ కోడి పిల్లలు సమృద్ధిగా లభిస్తున్నాయి. ◆



*ప్రాజెక్టు బృందం నుంచి కోడి పిల్లలను అందుకుంటున్న మహిళ*

## రిఫరెన్సెస్


సీఎస్ఈ, ఎఫ్ఎస్‌టీ నివేదిక యాంటీబయోటిక్ రెసిస్టెన్స్ ఇన్ పౌల్ట్రీ ఎన్విరాన్‌మెంట్ 2018, సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్, న్యూఢిల్లీ

కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన 2012 పశు గణన లెక్కలు - అఖిల భారత స్థాయి నివేదిక, 2012, వ్యవసాయ శాఖ, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ, ఫిషరీస్ శాఖ, కృషిభవన్, న్యూఢిల్లీ

వాసన్ - దేశీ పౌల్ట్రీ - ప్రాజెక్టు బ్రీఫ్, 2017 వాసన్ (గగగ ఆన్‌లైన్ సమాచారం ద్వారా సేకరణ)


## కృతజ్ఞతలు


ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెరటి కోళ్ల ఫారమ్‌ల కార్యక్రమం అమలుకు తోడ్పడుతున్న పశు సంవర్ధక శాఖ, ఐటీడీఏ, ఇంకా ఇతర ఫెసిలిటేటింగ్ ఏజెన్సీలకు ప్రత్యేక కృతజ్ఞతలు.



**Aneetha Kanukolanu**
WASSAN, #12-13-452,Street No 1,Tarnaka,
Secunderabad - 500017
E-mail: aneethak@wassan.org



ఆంగ్లమూలం :
లీసా ఇండియా, సంపుటి 20, సంచిక 3, సెప్టెంబర్ 2018

# సేద్యంలో వైవిధ్యం

## చిన్న రైతులకు తప్పనిసరి

**ఎం.ఎన్.కులకర్ణి, టి.సురేశ్**

**వాతావరణంలో వచ్చే మార్పులు చిన్న, సన్నకారు రైతుల జీవితాలను మరిన్ని కడగండ్లలో ముంచి వేస్తున్నాయి. ఈ చిన్న రైతుల జీవనోపాధి దారుణంగా దెబ్బతింటోంది. ఇలాంటి పరిస్థితిలో వైవిధ్యంతో కూడిన సేద్యం మాత్రమే వారి వ్యవసాయ జీవనాన్ని నిలకడగా కొనసాగించేందుకు ఆశారేఖగా కనిపిస్తోంది. అందుకు మంచి ఉదాహరణ ఉప్పరహళ్ళి గ్రామంలో చూడవచ్చు.**

కర్నాటక రాష్ట్రంలోని తుంకూరు జిల్లా చిక్కనాయకనహళ్ళి తాలూకాలోని ఓ కుగ్రామం ఉప్పరహళ్ళి. ఈ గ్రామంలో గట్టిగా 140 ఇండ్లు ఉన్నాయి. అక్కడి ప్రజలలో అందరికీ వ్యవసాయమే జీవనాధారం. దాదాపు 80 శాతం మంది సన్నకారు రైతులు కాగా 20 శాతం చిన్న రైతులే. తాలూకా మొత్తంలో కొబ్బరి తోటలు వాణిజ్యపరంగా విస్తృతంగా పెంచుతున్నారు. అయితే ఈ గ్రామంలోని వారు మాత్రం కూరగాయల సాగుపైనే ఆధారపడి జీవిస్తుంటారు. అందుకు ప్రధాన కారణం కొబ్బరి తోటలకు తరచుగా సోకుతున్న చీడపీడలే. వాటి వల్ల వారు విపరీతంగా నష్టపోయారు.

### కాయగూరల సాగు

ఉప్పరహళ్ళి గ్రామంలోని 50 నుంచి 60 మంది వ్యవసాయదారులు కాయగూరలనే సాగుచేస్తున్నారు. టమోటా, బెండకాయలు, బీరకాయలు, పొట్లకాయలు, బీన్స్, ఆకు కూరలు, మిరప వారు సాగుచేసే ముఖ్యమైన పంటలు. తమకున్న భూకమతం ఆధారంగా 5 గుంటల నుంచి అర ఎకరం కాయగూరల సాగుకు కేటాయిస్తున్నారు. నీటి లభ్యత ఉన్న వారు ఎకరా భూమిలో సైతం కాయగూరలు పండిస్తున్నారు.

కాయగూరలను సాగుచేసి జీవితం సాగిస్తున్న శ్రీ రంగయ్య తన అనుభవాన్ని ఈ విధంగా వివరించారు. ''వర్షాకాలంలో మెట్ట ప్రాంతాల్లో కాయగూరలను, వేసవి కాలంలో కొబ్బరి తోటలను పెంచుతుంటాం. కొబ్బరి తోటల్లోనే కాయగూరలు పెంచడం వల్ల నీటి సరఫరాకు సమస్య ఉండదు. ఎందుకంటే కొబ్బరి తోటలకు నిరంతరం నీటి సదుపాయం ఉంటుంది. ఈ రకంగా నీటి వాడకాన్ని పొదుపు చేసుకోవచ్చు. అందుబాటులో ఉన్న నీటితోనే కాయగూరలను సాగుచేయడమే కాకుండా కొబ్బరి తోటలను పెంచగలుగుతున్నాం.''

*తోటల పెంపకంపై తాను సాగిస్తున్న కృషిని సందర్శకులకు వివరిస్తున్న శ్రీ రంగయ్య*



సన్నకారురైతుఅయినరంగయ్యరాగులు(fingermillet),అలసం దలు (cow pea), కందులు (రెడ్ గ్రామ్), పెసలు (గ్రీన్ గ్రామ్) వంటివాటిని తనకుటుంబ అవసరాలకోసం సాగుచేస్తుంటాడు. కొద్ది సంవత్సరాల క్రితం కాయగూరల సాగును ఆయన కూడా చేపట్టాడు. ఒక రకంగా ఆయనే ఈ కొత్త స్ఫూర్తికి బీజం వేశాడని చెప్పాలి. ఇప్పుడు మరెందరో ఆయన చూపిన బాటలో అడుగులేస్తున్నారు.

రంగయ్య కూరగాయల సాగులో పోషకాలను అందించే పద్ధతులను విస్తృతంగా ఉపయోగించారు. తన వ్యవసాయ క్షేత్రంలో లభించే వ్యర్థాలతో తయారు చేసిన ఎరువులను ఎక్కువ మోతాదులో ఉపయోగిస్తారు. సాగునీటిలోనికి వెర్మి కంపోస్టు మిశ్రమం చేర్చి పొలానికి చేరవేస్తాడు. అంతేకాకుండా డ్రిప్ ఇరిగేషన్ కూడా అమలు చేశాడు. పశువుల మూత్రాన్ని నీటితో కలిపి (పది లీటర్ల నీటికి లీటర్ పశు మూత్రం చేర్చి) తరచుగా పొలంలో వెదజల్లుతాడు.

ఈ ఏడాది ఆయన అయిదు గుంటల్లో పొట్ల పాదులను, కాకరకాయలను2గుంటల్లోనూ,మిర్చిపంటను2గుంటల్లోను, బీన్స్ పెంపకాన్ని 10 గుంటల్లోనూ చేపట్టాడు. పొట్ల కాయలు అందుబాటుకు వస్తున్నాయి. ఇప్పటికే టన్ను పొట్లకాయలను మార్కెట్‌లో విక్రయించి ఒక్క నెలలో రూ.20000/- సంపాదించాడు. మిగిలినవి చేతికి అందాల్సి ఉంది. గత సంవత్సరంలో పొట్లకాయల ద్వారా రూ.60000/-, కాకర కాయల ద్వారా రూ.24000/-, బీన్స్ అమ్మకం ద్వారా రూ.45000/- సంపాదించాడు. ఇంకా ఇతర పంటల రూపంలోనూ, కొబ్బరి తోటల ద్వారా మరికొంత ఆదాయం పొందగలుగుతున్నాడు.

నీటి సదుపాయం సమృద్ధిగా ఉన్న రైతులు టమోటా, బెండకాయలు, బీరకాయలు, పొట్లకాయలు, బీన్స్ వంటి నాలుగైదు రకాలైన కాయగూరల సాగు చేపడతారు. ఇలా వివిధ రకాలను సాగుచేయడం వల్ల నష్టాల ప్రమాదం తగ్గుతుంది. అంతేకాకుండా ఇక్కడి రైతులు సేంద్రీయ సేద్య విధానాలను అనుసరిస్తుంటారు. కర్నాటక ప్రభుత్వం 2011 నుంచి 2013 వరకు ఈ గ్రామంలో పర్యావరణ అనుకూల సేద్య విధానాలను ఒక ప్రాజెక్టుగా చేపట్టింది. అప్పటినుంచి ఇక్కడి రైతులు వర్మీ కంపోస్టు, ఉపయోగిస్తూ రసాయన ఎరువల వాడకాన్ని 50 శాతం వరకు తగ్గించివేయగలిగారు. చాలా మంది చీడపీడల నివారణకు తోటలో పేరుకునే వ్యర్థాలనే ఉపయోగిస్తుంటారు. ఈ కారణంగా అప్పటివరకు రసాయన ఎరువులు, క్రిమి సం హారకాల కోసం వెచ్చిస్తున్న మొత్తం అంటే దాదాపు రూ.2500/- నుంచి రూ.3000/- వరకు ఆదా చేసుకోగలుగుతున్నారు.

వీరంతా సమీపంలో ఉన్న హులియార్, సీఎస్‌హళ్లి, కెబీ క్రాస్ పట్టణాలకు కూరగాయలను తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు. ఇవి వారి గ్రామానికి దగ్గరలోనే ఉంటాయి. గతంలో వాటిని తరలించేందుకు ప్రైవేటు బస్సులపై ఆధారపడేవారు. ఇప్పుడు తమ గ్రామంలోనే అందుకు అవసరమైన సదుపాయం అందుబాటుకు వచ్చింది. ఆటోలు కూడా లభిస్తున్నాయి. మార్కెట్ వరకు తీసుకెళ్లి అక్కడ మధ్య దళారీలకు నేరుగా అమ్ముకుంటారు. వారు పండించే కూరగాయల్లో ఒక్క టమోటా విషయంలోనే గ్రేడింగ్ చేసే పరిస్థితి ఉంది. ''గ్రేడ్ చేసిన టమోటాకు ఒక బాక్సు అమ్మితే రూ.50/- అదనంగా లభిస్తోంది'' అంటున్నారు రంగయ్య. బీన్స్ పంటను మాత్రం అందరూ సమిష్టిగా అమ్ముకుంటున్నారు. సరైన సీజన్‌లో రోజుకు

*కాయగూరల సాగు ద్వారా మెరుగైన ఆదాయం సంపాదించుకుంటున్న శివమ్మ వంటి రైతులు ఇక్కడ ఎంతో మంది ఉన్నారు*






తన వ్యవసాయ క్షేత్రంలోనే లభించే జీవ ఎరువులను (బొటానికల్ లిక్విడ్ ఫెర్టిలైజర్స్) ద్రవరూపంలో తయారుచేసుకుని ఉపయోగించడం రంగయ్య ప్రత్యేకత

టన్ను బీన్స్ హులియార్ మార్కెట్‌లో అమ్ముడవుతూ ఉంటాయి. ఉప్పరహళ్లి కూరగాయలు వినియోగదారులను బాగా ఆకట్టు కుంటున్నాయి. ఎక్కువ గిరాకీ ఉంటోంది. బేరసారాల అవసరం ఉండదు. సగటున బీన్స్ సాగుచేసే ప్రతీ రైతుకు వారానికి రూ.4000/- నుంచి రూ.5000/- దక్కుతోంది. దీని సాగుకు అయ్యే ఖర్చు రవాణాతో కలిపి రూ.1500/- మాత్రమే.

కూరగాయలతో పాటు ఆహార పదార్థాలను కూడా పండిస్తున్న మరో రైతు తిమ్మయ్య తన అభిప్రాయాన్ని ఈ విధంగా తెలియజేశారు. ''మా గ్రామంలోని కుటుంబాలన్నీ కేవలం 2 నుంచి 5 ఎకరాల భూమి ఉన్న వారు మాత్రమే. మెట్ట ప్రాంతాల్లో రాగులు సాగుచేస్తాం. పెసలు (గ్రీన్ గ్రామ్), ఉలవలు (హార్స్ గ్రామ్), కందులు (రెడ్ గ్రామ్) వంటివి కూడా పండిస్తాం. వర్షపాతం సాధారణంగా ఉన్నట్లయితే ఎకరాలో 6 నుంచి 8 క్వింటాళ్ల రాగులు, పప్పులు దిగుబడిగా వస్తుంది. ఇవి కుటుంబ అవసరాలకు సరిపోతాయి. ఇక నుంచి నాణ్యమైన కూరగాయలకు మా గ్రామం పేరు సంపాదించుకుంది.''

## అనుబంధంగా పాడి పరిశ్రమ

ఆశ్చర్యం కలిగించే విషయం ఏమిటంటే కూరగాయలను సాగుచేస్తున్న వారిలో చాలా మంది రెండు లేక మూడు పశువులను కూడా పెంచుతున్నారు. దాదాపు 90 మంది రైతులకు ఈ ప్రాజెక్టులో భాగంగా పాడి పశువుల కొనుగోలుకు సహకారం లభించింది. టిప్‌టూర్‌లోని బెయిఫ్ సంస్థ - ఇనిస్టిట్యూట్ ఆఫ్ సస్టయినబుల్ లైవ్లీహుడ్స్ అండ్ డెవలప్‌మెంట్ - ఈ రైతులంతా సేంద్రీయ సేద్యం చేపట్టి ఉత్తమ పద్ధతులను అనుసరించేందుకు అవసరమైన అన్ని రకాలైన ప్రోత్సాహాన్ని అందిస్తోంది. ఫలితంగా పాడి ఉత్పత్తి అధికమవుతోంది. ఇక్కడి పాడి రైతులు రోజుకు 8 నుంచి 10 లీటర్ల పాలు విక్రయిస్తుంటారు. స్థానికంగానే పాల సేకరణ కోసం ఉప్పరహళ్లిలోనే ప్రత్యేకంగా ఒక కేంద్రం ఏర్పాటు కావడం వారికి మరింత ప్రయోజనం కలిగిస్తోంది.

## వనరుల పునర్వినియోగం

ఇక్కడి రైతులు అందుబాటులో ఉన్న వనరులను మళ్లీ మళ్లీ వినియోగించుకునే విషయంలో పరస్పరం సహకరించుకుం టున్నారు. జొన్న వ్యర్థాలు, ఇంకా జీలుగ లేక జనుము (sun hemp), రాగులు వంటివి పశువుల మేతగా ఉపయోగిస్తున్నారు. పశువుల మలమూత్రాలను కంపోస్ట్ ఎరువులుగా మార్చి పొలాల్లోకి చేరుస్తున్నారు. కూరగాయల సాగులో తిరిగి ఉయోగిస్తున్నారు. కొంత మంది రైతులు బురద మట్టిని కూడా ఉపయోగిస్తున్నారు. ఇలా చేయడం వల్ల రసాయన ఎరువుల వాడకం బాగా తగ్గిపోయింది. పశువులు ఇచ్చిన పాలు మాత్రమే నిజానికి బయటకు వెడుతుంటాయి. మిగిలినవన్నీ స్థానికంగానే మళ్లీ ఏదోరూపంలో ఉపయోగింలోకి వస్తున్నాయి. అంటే ఇక్కడ వృధా అయ్యేది ఏదీ లేదు. ప్రతీదీ మళ్లీ మరో విధంగా ఉపయోగంలోకి వస్తోంది.

## ముగింపు

ఉప్పరహళ్లి గ్రామంలో ఉన్న 140 కుటుంబాలలో 50 నుంచి 60 కుటుంబాలు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చేపడుతున్నాయి. అందువల్ల వారికి పోషక విలువలతో కూడిన ఆహారంతో పాటు మరింత ఆదాయం లభిస్తోంది. ఇలా పంటల సాగు, కాయగూరల పెంపకం, పాడి పరిశ్రమలను చేపట్టి వ్యవసాయంలో వైవిధ్యాన్ని తీసుకురావడం ద్వారా వారు నికరమైన ఆదాయాన్ని పొందగలుగుతున్నారు. స్థిరత్వం లేని వాతావరణ పరిస్థితులలో వైవిధ్యంతో కూడిన సేద్యం ఇతరత్రా నష్టాలను నివారించగలుగుతోంది. ఆదాయం నిలకడగా ఉంటోంది. వారి జీవనోపాధులు మరింత విస్తృతమయ్యాయి. ◆


**M N Kulkarni**
BAIF Office, Kusumanagar
Kelageri road, Dharwad-580008
E-mail: mnkulkarni65@gmail.com



ఆంగ్లమూలం :
లీసా ఇండియా, సంపుటి 20, సంచిక 3, సెప్టెంబర్ 2018

# రైతన్న అనుసరించే సేద్య విధానాలే సుస్థిరమైన పర్యావరణ భద్రతకు శ్రీరామరక్ష

ఎస్.కళావతి, ఎ.అబ్దుల్ హారిస్, జీనా మాథ్యూ, వి.కృష్ణకుమార్

**వ్యవసాయ రంగంలో విజయ సాధన ప్రధానంగా అనుకూలమైన సేద్య విధానాలు అనుసరించడంతో పాటు వ్యవసాయ-పర్యావరణ హితమైన కారణాలను అవగాహన చేసుకోవడంపైనే ఆధారపడి ఉంటుంది. సన్నకారు రైతులు తరతరాలుగా వ్యవసాయ రంగానికి ఎదురయ్యే ప్రతికూల పరిస్థితులను అవగాహన చేసుకోవడమే కాకుండా వాటిని సమర్థవంతంగా అడ్డుకోగలిగిన అనేక విధానాలను గుర్తించి ఆచరణలో పెట్టి మంచి ఫలితాలను సాధించగలుగుతున్నారు. ఈ విషయంలో రైతన్నల గొప్పదనం ఎక్కడ ఉందీ అంటే కొత్త పద్ధతులను, నైపుణ్యాలను గుర్తించి వాటికి తగిన విధంగా తమను తాము మార్పు చేసుకుంటూ నూతన పద్ధతుల ఆవిష్కరణకు చూపించే స్ఫూర్తివంతమైన మానసిక ధృఢత్వం సమకూర్చుకోవడంలోనే. అదే ఉత్సాహంతో వ్యవసాయ -పర్యావరణ విధానాలను, నిర్వహణ పద్ధతులను అనుసరించడమే. స్థానికంగానే లభించే ఈ సరికొత్త విజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవడంపైనే పర్యావరణపరమైన స్థిరత్వం సాధ్యమవుతుంది.**

*అరటి మొక్కలను పెంచే కుండల్లో పొట్టు నింపడం ద్వారా నీటి ముంపు ముప్పు చాలా వరకు పరిష్కారమైంది*



కేరళ సముద్ర తీరంలో కొబ్బరి సాగు ఎక్కువ అనుకూలంగా ఉంటుంది. అయినా కూడా దిగుబడి కొద్దిగానే ఉంటుంది. అందుకు ప్రధానమైన కారణం - అక్కడి భూసారంలో పెద్ద మొత్తంలో పేరుకుపోయి ఉన్న భౌతిక - రసాయనక లక్షణాలే. భూసారం అంతంత మాత్రమే కావడం మరో కారణం. నేలలోకి నీరు ఇంకిపోయే స్వభావంలో కనిపించే మార్పులు, ఉప్పు నీటి ముంపు కూడా అందుకు కారణాలే. ఈ కారణాల వల్ల కేరళ దక్షిణ ప్రాంతంలో కొబ్బరి సాగు పెద్ద సమస్యగా మారిపోయింది. ఈ కారణాలన్నిటి ప్రభావం వల్ల ఇక్కడి రైతన్నలు అంతర్ పంటల సాగు కానీ, ఏడాది పొడవునా సాగు చేయడం కానీ సాధ్యం కావడం లేదు.

ఈ ప్రతికూల పరిస్థితులను గమనించిన రైతన్నలు తమ సొంత వ్యవసాయ క్షేత్రాలలో వాతావరణ మార్పులను తట్టుకోగలిగిన ప్రత్యేక విధానాలను గుర్తించి ఉపయోగిస్తున్నారు. ఫలితంగా దిగుబడి పెరుగుతోంది. కోస్తా ప్రాంతంలో ఎదురయ్యే వాతావరణ వైరుధ్యాలను సమర్థవంతంగా తట్టుకోగలిగే సామర్థ్యాన్ని సమకూర్చుకోగలుగుతున్నారు. ఈ విధానాలపై చేపట్టిన మరి కొన్ని ప్రయోగాలు, అధ్యయనాల వల్ల మరికొన్ని ప్రయోజనాలు సాధ్యమయ్యాయి. ముఖ్యంగా భారత వ్యవసాయ పరిశోధన మండలి (ICAR) - తోటల పెంపకం పరిశోధన కేంద్ర సంస్థ (CPCRI) సంయుక్తంగా భాగస్వామ్య పద్ధతిలో ఈ ప్రయోగాలు, అధ్యయనాలను చేపట్టాయి. రైతులకు అవసరమైన ఇన్‌పుట్‌లను శాస్త్రీయ పద్ధతిలో అందుబాటులోకి తీసుకువచ్చాయి.

## ప్రారంభం ఎక్కడ అంటే

తోటల పెంపకం పరిశోధన సంస్థ ఈ విషయంలో అనేక రకాలైన ఉత్తమ విధానాలను రైతులకు పరిచయం చేసేందుకు పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతోంది. ముఖ్యంగా కొల్లం జిల్లాలోని అలప్పాడు, అలప్పూజ జిల్లాలోని అరత్తుపుజా పంచాయతీలలో ఇసుక మట్టి ఉన్న పొలాలే ఎక్కువ. అలాంటి చోట్ల ఉత్తమ పద్ధతులను, సేద్య విధానాలను ఈ సంస్థ ప్రచారం చేస్తోంది. ఈ కార్యక్రమాలలో భాగంగా, స్థానికంగా లభ్యమవుతున్న పరిజ్ఞానాన్ని ఉపయోగించి రైతు దంపతులు దేవదాస్, శ్రీమతి సత్యవతి (అలప్పాడు పంచాయతీ), అర్ధపుజ పంచాయతీకి చెందిన రైతు శ్రీ బాబూ ముతిరపరంబిల్ సాధించిన ఫలితాలను ప్రధానంగా ప్రదర్శించి ఇతరులకు ప్రోత్సాహం

> అంతర్ పంటలలో పైనాపిల్ సాగు అన్నిటికన్నా ఉత్తమమైనదిగా గుర్తించడం జరిగింది. ఈ పంట సాగు ద్వారా నీటి ముంపు సమస్యను తట్టుకోవడం సాధ్యమైంది

ఇస్తున్నారు. ఈ రైతు కుటుంబాలు అనుసరించిన విధానాలు మరికొన్ని మార్పులు చేర్పుల తరువాత కోస్తా ప్రాంత రైతులకు వరదాయినిగా మారుతున్నాయి. పై రెండు ప్రాంతాల్లోనూ 2012-15 సంవత్సరాల మధ్య కాలంలో 0.6 హెక్టార్ల భూమిలో (వేర్వేరుగా చేపట్టినవి) ఈ ఆచరణీయ విధానాల ప్రదర్శన జరిగింది.

రెండు ప్రాంతాలలోను కూడా నేలల్లో క్షార (nonsaline) గుణాలు లేవు. అయితే పీహెచ్ (pH) స్థాయి 4.5 నుంచి 6.3 మేరకే ఉన్నది. అది కూడా సేంద్రీయ కార్బన్, పొటాషియమ్, కాల్షియమ్, మాగ్నీషియం ఉన్నట్టు తెలిసింది. అంటే ఈ మోతాదు చాలా తక్కువే అని చెప్పాలి. ఇక హెచ్చు మోతాదులో ఫాస్ఫరస్, మాంగనీస్, ఐరన్, జింక్ ఉన్నాయి. ఈ పరిస్థితులలో వ్యవసాయం సాఫీగా సాగేందుకు అనుసరించిన ఉత్తమ నిర్వహణ పద్ధతుల్లో భాగంగా, ముఖ్యంగా పంటల సాగు కారణంగా లభించే వ్యర్థాలను తిరిగి ఉపయోగించడం ద్వారా సేంద్రీయ కార్బన్ పరిమితి ప్రధాన పంటల్లో 74 శాతం వరకు, అంతర్ పంటలలో 32 శాతం వరకు గుర్తించారు. ఉత్తమ సేద్య పద్ధతులలో భాగంగా అవసరాన్ని బట్టి కటన్ని దిద్దుబాటు చేసుకోవలసి వచ్చింది. కొన్ని రకాలైన ఫెర్టిలైజర్స్ ఉపయోగించాల్సి వచ్చింది. ముఖ్యంగా పొటాషియం, మాగ్నెటిజమ్, కాల్షియమ్ వంటి పోషకాల స్థాయి పెరిగింది. ఐరన్, ఫాస్ఫరస్ తగ్గినట్టు కూడా గుర్తించారు. భూసారంలో ప్రయోజనకరమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ ప్రయోజనాలు కొబ్బరి సాగులోనే కాకుండా అంతర్ పంటల సాగులో కూడా కనిపించాయి. ఇందుకోసం వ్యవసాయపరమైన టెక్నిక్‌ను ఉపయోగించారు. అది పోషకాలలో సమతూకం సాధించేందుకు, సమీకృత నిర్వహణ సాధించేందుకు, సూక్ష్మ సాగునీటి వసతి కల్పించేందుకు వీలుగా పొట్టును పాతిపెట్టే పద్ధతి అనుసరించడం జరిగింది. వీటి ఫలితంగా అధిక దిగుబడి సాధ్యమైంది.

నీటి ముంపు సమస్యను, ఉప్పు నీటి సమస్యను పరిష్కరించేందుకు గానూ అంతర్ పంటలుగా అనేక రకాలు పండించడం ప్రారంభించారు. వాటిలో ముఖ్యమైనవి - పైనాపిల్, అరటి పండ్లు (నాలుగు రకాలు), రకరకాలైన దుంపలు, కాయగూరలు, ఇంకా ఆయా సీజన్లకు అనువైన కూరగాయలు, పశువుల మేత, అల్లం, పసుపు వంటివి సాగు చేస్తూ వచ్చారు. వాటిని సాగుచేసేందుకు ఉన్న అవకాశాలపై పరిశీలించి చూశారు. వాటిలో పైనాపిల్ అన్ని రకాలుగానూ ఉపయోగకరమని నిర్ధారణ అయింది. నీటి ముంపు సమస్యను ఈ పంట బాగా తట్టుకోగలిగింది. దీని తరువాత నెంద్రన్ తరహా అరటి తోటలు, పశువుల గడ్డి, చేమగడ్డ వంటివి అంతర్ పంటలుగా సాగుకు అనువైనవిగా తేలింది. ఇంకా ఇతర రకాలుగా కూడా అంటే మొక్కల తొట్లలో పొట్టు పాతిపెట్టడం,

కోస్తాలోని ఇసుక నేలల్లో కొబ్బరి పీచును ఉపయోగించి చేసిన కంపోస్టు ద్వారా ఫలితాలను అధ్యయనం చేశారు.

## సేద్యరంగంలో రైతులు అనుసరించే ఉత్తమ పద్ధతులు – వాటి ప్రభావం

రైతులు తాము అనుసరించే సేద్య పద్ధతులలో కొన్ని మార్పులు చేసుకున్నారు. వాటిని రైతులకు తోటల పెంపకం పరిశోధన కేంద్రం సూచించింది. మంచి ఫలితాలు సాధించగలిగారు.

## ఎ. పైనాపిల్

నీటి ముంపు సమస్యను తట్టుకోవడంలో పైనాపిల్ పంటకు మంచి సామర్థ్యం ఉన్నట్టు నిర్ధారణ అయింది. కారణంగా వీటిని సాగు చేసే రైతులకు 1.0 కిలోల నుంచి 1.7 కిలోల వరకు దిగుబడి లభించింది. మొక్కలు నాటే సమయంలో పాదుల అడుగు భాగంలో పొట్టును ఒక పొరలా వేస్తారు. కేంద్రం సూచించిన విధంగా అంటే బోర్లించిన కొబ్బరి చిప్ప ఆకృతిలో పొట్టును పేరుస్తారు. ఈ రకంగా నాటిన మొక్కల పెరుగుదల ఏపుగా ఉండడమే కాకుండా చీడపీడలను తట్టుకోవడంలో సమర్థవంతంగా నిలవడాన్ని గమనించారు. ముఖ్యంగా అన్ని విధాలా నియంత్రిత పద్ధతిలో సాగు చేసినప్పటి పెరుగుదలతో పోల్చినప్పుడు ఈ పెరుగుదల ఏపుగా ఉండడం ప్రారంభ దశలో స్పష్టంగా కనిపించింది. అయితే మొక్కల మొదళ్లలో నీరు పేరుకుపోయిన సందర్భాలలో ఈ పెరుగుదల తగ్గినట్టు గుర్తించారు. ఎందుకంటే ఆ సమయంలో లోపల పేర్చిన పొట్టులోకి నీరు చేరడమే. ఇది గుర్తించిన రైతు పొట్టును అడుగు భాగంలో కాకుండా పక్కల మాత్రమే నిలిచేలా అమర్చాడు. ఇది మరింత మెరుగైన ఫలితాన్ని అందించింది. ఈ పద్ధతి అనుసరించిన తరువాత, పెరుగుదల సంతృప్తికరంగా ఉండడం, తక్కువ కాలానికి కాపు కాయడం, పండ్లు మరింత బరువుగా నిలవడం (పైనాపిల్ సగటు బరువు 1.75 కిలోలు) వంటి మంచి ఫలితాలు కనిపించాయి. సాధారణ పద్ధతిలో పైనాపిల్ సాగుచేసినప్పటి ఫలితాలతో (సగటున పండు ఒక్క కిలో మాత్రమే) బరువు పోల్చినప్పుడు ఈ తేడాలు స్పష్టంగా కనిపించాయి. పట్టు అమరిక పక్కన ఏర్పాటు చేసినప్పుడు దాదాపు అత్యధిక శాతం మొక్కల్లో అంటే సుమారుగా 80 శాతం మేరకు 50 నుంచి 60 వారాల్లోనే (సగటున 57 వారాలు మాత్రమే) ఫలవంతమయ్యాయి. అంటే దాదాపు 6 నుంచి 8 వారాల ముందే పంట చేతికొచ్చింది.

## బి. అరటి తోటలు

వివిధ రకాలైన అరటి మొక్కల్లో నెంద్రన్ రకం మంచి ఫలితాలు ఇచ్చింది. సగటున ఒక్కో అరటి చెట్టు నుంచి 7 కిలోల బరువు ఉండే గెలలు వచ్చాయి. దీనితో పోలిస్తే ఇతర రకాలు రెడ్ బనానా, ఎన్జలిపూవన్, రొబస్తా రకాలు అంతగా ఉపయోగకరంగా లేవు. నెంద్రన్ రకం అరటి నీటి ముంపు సమస్యను తట్టుకోగలదు. అందుకు కారణం అతి తక్కువ కాలంలోనే ఇవి ఫలితం అందిస్తాయి. ఎన్జలిపూవన్ రకం నీటి ముంపు ప్రమాదాన్ని గురయ్యే అవకాశం ఉన్నప్పటికీ, అధిక దిగుబడితో పాటు గిరాకీ ఎక్కువగా ఉండడం వల్ల వీటి పెంపకానికి రైతులు ఆసక్తి చూపిస్తుంటారు. మార్కెట్‌లో విక్రయాలు తేలిక, ధర అధికం. సాధారణ నాట్ల సమయంలో పొట్టు ఉపయోగించి కానీ, ఉపయోగించకుండా కానీ ఎక్కువ మొత్తంలో మొక్కలు దాదాపు 73 శాతం నీటి ముంపునకు గురయ్యాయి. దిగుబడి స్వల్పంగా తగ్గిపోయింది. ఇందుకు కారణం గెలల్లో కాయలు ఏర్పాటు దెబ్బతినడమే. క్షేత్ర స్థాయిలో చేపట్టిన ప్రయోగాల్లో - నాట్ల సమయం ముందుకు తీసుకెళ్లడం, 4-5 నెలల వయసున్న మొక్కలను నాటడం, పాదుల్లో బురద నింపడం, ఆకుపచ్చని వ్యర్థాలను ఎరువుగా ఉపయోగించడం, కొబ్బరి పీచుతో సిద్ధం చేసిన ఎరువుల వాడకం, పొట్టు పాతడం వంటి చర్యలు అరటి తోటల సాగుకు తోడ్పడ్డాయి. మంచి ఫలితాలు ఇచ్చాయి. దాదాపుగా అన్ని మొక్కలను నీటి ముంపు నుంచి కాపాడడం సాధ్యమైంది. ఫలితంగా దిగుబడి 80 శాతం అధికంగా వచ్చింది. సగటు దిగుబడి ఎన్‌జలిపూవన్ రకం సగటున 13.5 కిలోల గెలలను ఇచ్చాయి. రొబస్టా రకం 22.5 కిలోల గెలలను ఇచ్చాయి.

## సి. పశువుల మేత

నీటి ముంపు కారణంగానే వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో పశువుల మేత దిగుబడి స్వల్పంగానే ఉంటుంది. ఇది సహజం. ఈ సమయంలో ఉపయోగించే ఎరువులు ఏ రకంగానూ ఉపయోగపడవు. అందువల్ల రైతులు బయోగ్యాస్ ఉత్పత్తి సమయంలో లభించే వ్యర్థాలు అంటే బురద వంటి వాటిని ఎరువులుగా ఉపయోగించారు. ఈ బురదను నాట్లు వేసిన చాళ్లకు పక్కగా ప్రయోగించారు. ఈ అమరిక కారణంగా నీటి ముంపు లేదా పేరుకుపోయే పరిస్థితి లేకుండా కాపాడడం సాధ్యమైంది. మొక్కలకు దగ్గరలో నీటి నిల్వ లేకుండా చేయగలిగారు. వాయుప్రసరణ సాఫీగా సాగింది. ఫలితంగా పెరుగుదల సాఫీగా ఉండి అధిక దిగుబడి సాధ్యమైంది.

## డి. దుంపల సాగు

సాధారణంగా నాట్లు వేసే సమయంలో సాగు చేపట్టిన దుంపలు ఏవైనా సరే నీటి ముంపు ప్రమాదం వల్ల నష్టదాయకంగా ఉంటాయి. అయితే చేమ దుంప (టారో) పరిస్థితి భిన్నంగా ఉంటుంది. దుంపల సాగు విషయంలో రైతులు అనేక రకాలైన ప్రయోగాలు చేశారు. స్వల్పకాలానికే ఫలితం ఇచ్చే కొన్ని రకాలు - వెల్లయని హ్రస్వా, శ్రీ జయ, శ్రీ విజయ వంటివి నాటి చూశారు. ఈ రకమైన దుంపలను టపోయికా (కర్రపెండలం రకానికి



*రోబస్టా అరటి పండ్లు ఆరోగ్యవంతమైన మొక్కలతో ఆరోగ్యానికి తోడ్పడే పండ్లతో ఆకట్టుకుంటున్నాయి*

చెందినవి) అని వ్యవహరిస్తారు. సాధారణంగా అక్టోబర్-నవంబర్ మాసాల మధ్య వీటి సాగు చేపడతారు. ఇవన్నీ తక్కువ వ్యవధిలోనే ఫలితం ఇస్తాయి. వీటిని నాటే కాలాన్ని ముందుకు జరపడం ద్వారా అధిక దిగుబడి సాధించగలిగారు. సగటున ఒక్కో మొక్కకు 3.2 కిలోలు దిగుబడి వచ్చింది. ఇక ఎలిఫెంట్ ఫుట్ యామ్, పెండలం (డయాస్కోరియా) దుంపల సాగుకు గత ఏడాది పంటను కొనసాగించి సగటున 6.3 కిలోల వరకు (ఒక్కో మొక్కకు), గజేంద్ర రకం పెంపకం ద్వారా మొక్కకు సగటున 5.2 కిలోల దిగుబడి సాధించగలిగారు. ఇక స్థానికంగా ఉపయోగంలో ఉన్న పీరుమెడు సాగు ద్వారా మొక్కకు 13.5 కిలోల దిగుబడి వచ్చింది. ఇది కూడా ఎలిఫెంట్ ఫుట్ యామ్ జాతికి చెందినదే. గత సంవత్సరంలో నష్టానికి కారణమైన ఈ ఎలిఫెంట్ ఫుట్ యామ్, దయాస్కోరియా మొక్కలను అలాగే కొనసాగించిన కారణంగా అధిక దిగుబడినిచ్చింది. అది కూడా సీజన్ కాని కాలంలో! ఫలితంగా అంతకు ముందు వచ్చిన నష్టాలను కూడా భర్తీచేసుకోగలిగారు. ఇక టానియా రకానికి చెందిన దుంపలు ఏపుగా ఎదగలేకపోయాయి. ముఖ్యంగా వర్షాలు జోరుగా ఉన్న సమయంలో, నీటి ముంపు నష్టానికి కారణమైంది. ఈ సమస్యకు పరిష్కారంగా కిలో ట్రైకోడెర్మా అంటే శుద్ధి చేసిన కొబ్బరి పీచు కంపోస్టును 50 గ్రాముల మురియేట్ పొటాష్‌తో కలిపి ఉపయోగించారు. దాంతో దిగుబడి రెట్టింపు అయింది.

### ఇ. కాయగూరలు

కాయగూరల సాగు విషయంలో శుద్ధి చేసిన ట్రైకోడెర్మా ఎస్‌పీతో ఇతర సేంద్రీయ పదార్థాలను వినియోగించారు. అది పెరుగుదలను పెంచడమే కాకుండా దిగుబడి 20 నుంచి 30 శాతం వరకు అధికంగా వచ్చింది. కూరగాయల్లో ఆకుకూరలు, కాకరకాయలు, అలసందలు (కౌ పీ), టమోటా, కాలీఫ్లవర్, క్యాబేజీ మంచి ఫలితాలు సాధించి పెట్టాయి. కాలీ ఫ్లవర్ ఒకొక్కటి 2 కేజీల నుంచి 2.5 కిలోల వరకు బరువు తూగింది. ఒక్క మొక్క సాయంతో 18 కిలోల వరకు కాకర కాయలు వచ్చాయి. అలసందలయితే 4 కిలోల వరకు లభించింది.

### రైతుల ఆవిష్కరణల ఆర్థిక ప్రయోజనాలు

కొబ్బరి దిగుబడి 2014లో అరట్టుపుజాలో 59 శాతం, అలప్పడ్ ప్రాంతంలో 54 శాతం వరకూ అధికంగా వచ్చింది. ఈ పెరుగుదల 2012 నాటి దిగుబడితో పోలిస్తే స్పష్టంగా కనిపించింది. పైనాపిల్, అరటి తోటల వంటి అంతర పంటల సాగులో ఆదాయం చేతికి అందడానికి పట్టే వ్యవధి ఎక్కువగా ఉంటుంది. నీటి ముంపు ప్రభావంతో వచ్చే నష్టంతో పోల్చి చూసినప్పుడు 2012-13 సంవత్సరంలో వచ్చిన ఆదాయం స్వల్పంగానే కనిపించింది. ఇది కొబ్బరి ఆధారిత సేద్య విధానంలో సాగు చేసినప్పటి పరిస్థితి. అయినా కానీ లాభం-ఖర్చులను బేరీజు వేసినప్పుడు కోస్తా ప్రాంతాలో ఈ పద్ధతి వల్ల వీటి నిష్పత్తి 1.95-1.59 మాత్రమే కావడం గమనించాల్సిన విషయం. ఈ ఫలితాలను ఆధారం చేసుకుని రైతులు తమ వ్యవసాయ విధానాల్లో కొన్ని సర్దుబాట్లు చేసుకున్నారు. అవన్నీ కూడా ప్రధానంగా వాతావరణంలో తరచుగా వచ్చే మార్పుల ప్రభావాన్ని తట్టుకునేందుకు అనుసరించినవే. వైవిధ్యంతో కూడిన సేద్యం, వ్యవసాయం ఆర్థికపరంగా భారంగా మారకుండా ఉండడం లక్ష్యంగా వాటికి రైతులు ఆసక్తి చూపించారు. అంతిమంగా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం వారి ధ్యేయంగా మారింది. మొత్తం మీద కొబ్బరి ఆధారిత పంటల సాగు కారణంగా 2013-14 సంవత్సరంలో వారికి వచ్చిన ఆదాయం రూ.1.35 లక్షల నుంచి రూ.1.89 లక్షల వరకు అని తేలింది. ఈ ఆదాయం ముఖ్యంగా ఎంత వేగంగా అంతర్ పంటల సాగు మార్పిడి అనుసరించారనే దానిపై ఆధారపడింది. ఇది అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే మూడు రెట్లు ఎక్కువగా ఉంది.

### ముగింపు వాక్యాలు

పంట దిగుబడి సాధనలో ఉష్ణోగ్రతల్లో మార్పులు, నీరు, గాలి తేమ వంటి అంశాలలో వస్తున్న మార్పులను వాటి ప్రభావాన్ని

నిశితంగా పరిశీలించిన తరువాతనే రైతులకు వాటిపై స్పష్టమైన ఒక అవగాహన ఏర్పడింది. వాతావరణ సవాళ్లను తట్టుకోవడంలో రైతు అవగాహన ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. ఆ అవగాహన స్థాయిని బట్టి మాత్రమే రైతు అవసరమైన దిద్దుబాటు చర్యలను ఎంపిక చేసుకుని ఆచరణలో పెట్టగలుగుతారు. ఇలా స్థానికంగా రైతులు ఆవిష్కరించిన విధానాలన్నీ కూడా స్థానికంగా లభించే వనరులను ఉపయోగించుకునేందుకు వీలుగా ఉంటాయి. ఫలితంగా తక్కువ ఖర్చుతోనే వాటి ప్రయోజనాలను రైతు పొందగలుగుతాడు. ఇలాంటి రైతు ఆవిష్కరణలకు తగిన ప్రోత్సాహం ఇస్తే చిన్న స్థాయిలో వ్యవసాయం సుస్థిరంగా నిలిచి ఉండగలుగుతుంది. ◆

**S Kalavathi**
Principal Scientist (Agrl. Extension)
ICAR-Central Plantation Crops Research Institute
Regional Station, Krishnapuram.P.O.
Kayakulam, Kerala, India
E-mail: kalacpcri@gmail.com

ఆంగ్లమూలం :
లీసా ఇండియా, సంపుటి 20, సంచిక 4, డిశెంబర్ 2018

*పైనాపిల్ సాగులో ఆధునిక పద్ధతిని అనుసరించి పాట్లు భూమి అడుగు పారల్లోకి పాతిపెట్టడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న దృశ్యం*

